ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

**(ఈడూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 5-5-96)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేదములను అందరూ అర్థంచేసుకోలేరు కాబట్టి వేదములలో ఉన్న సారమును తీసి ఆయన సొంత మాటలతో కొన్ని పుస్తకాలను శంకరాచార్యులవారు వ్రాసారు. వేదములలో ఉన్న సారమును ప్రకటించారు కాబట్టి వాటికి ప్రకరణ గ్రంథములు అని పేరు వచ్చింది. శంకరాచార్యులవారు చివరి రోజులలో వ్రాసిన గ్రంథము వివేక చూడామణి. ఇది ప్రకరణ గ్రంథము. ఉపనిషత్తులలో చెప్పిన విషయాన్ని అర్థంచేసుకొంటే, పరమేశ్వరునిపట్ల ప్రీతి, భక్తి కలిగి ఉంటే మనకు ఎన్ని జన్మలు వచ్చినా ఇబ్బంది లేదు అని ఆచార్యులవారు చెప్పారు.

జీవుడికి అనేక జన్మలు రావచ్చును. మానవ జన్మరావటం కష్టం. పూర్వజన్మలో ఎంతోకొంత పుణ్యంచేసి ఉంటేతప్ప మానవజన్మ రాదు. మానవజన్మ రావటం కష్టం. పవిత్రంగా జీవించాలి, ఉన్నత భావాలతో జీవించాలి అని రావటం ఇంకా కష్టం. ఆధ్యాత్మిక జీవితమును అలవరచుకోవాలి, భగవదనుభవం పొందాలి అనే సంకల్పము రావటం ఇంకా కష్టం అని ఆచార్యులవారు చెప్పారు. భగవద్గీత, ఉపనిషత్తులు చదువుకొని జ్ఞానులు చెప్పిన మాటలు చదువుకొని అర్థం చేసుకోవటం ఇంకా కష్టం. ఇవి అన్నీ ఒకదాని కంటే ఇంకొకటి కష్టం అని ఆచార్యులవారు చెపుతున్నారు. భగవద్గీత చదివితే చదువవచ్చును. కాని చదివినది ఆ శబ్దంయొక్క అర్థం ఏమిటి? అందులో ఉన్న తాత్పర్యము ఏమిటి? అందులో మనం గ్రహించవలసినది ఏమిటి? భగవంతుడు ఏ ఉద్దేశంతో ఆ శబ్దాన్ని ఉపయోగించాడో ఉన్నది ఉన్నట్లుగా దానిని గ్రహించటం ఇంకా కష్టం. మనలో ఉన్న వాసనలు ఆ శబ్దంయొక్క అర్థాన్ని మన బుర్రకు సరిగా పట్టనివ్వవు. ఒక గ్రంథాన్ని చదివి ఉన్నది ఉన్నట్లుగా అర్థంచేసుకోవటం మీరు అనుకొన్నంత తేలిక కాదు. అదికూడా కష్టమే. మీరు ఏ బ్రహ్మం గురించి అయితే పుస్తకాలలో చదివారో దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటం ఇంకా కష్టం.

మనం వస్తువును ఎలా పొందాలి అని తెలుసుకోవటం జ్ఞానం. తెలుసుకొన్న విషయాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటం విజ్ఞానం. జ్ఞానానికి, విజ్ఞానానికి కొంత గేప్ ఉంటుంది. మీరు తెలుసుకొన్న విషయం మీకు అనుభవంలోకి రావటం కష్టం. మీరు తెలుసుకొన్న విషయం మీకు అనుభవంలోనికి రావటానికి జన్మాంతరములో నుండి వచ్చే వాసనలు అడ్డువస్తాయి. అడ్డువచ్చినపుడు వాటిని తొలగించుకోవటానికి మీరు ప్రయత్నంచేస్తారు, తొలగము అని అవి చెపుతాయి. అప్పుడు విపరీతమైన పోరాటం జరుగుతుంది. అప్పుడు తట్టుకోగలిగితే జ్ఞానం విజ్ఞానంగా మారుతుంది. తెలుసుకొన్న విషయం మీకు అనుభవంలోనికి రావటానికి గురువు అనుగ్రహం అవసరము. ఏదో ఉపనిషత్తులు చదివాము అంటే సరిపోదు. ఆ విషయాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి కొంతకాలం పడుతుంది. కొంత పోరాటం జరుగుతుంది.

నీవు ఏ విషయాన్ని అయితే గ్రహిస్తున్నావో అది హృదయంలో అనుభవించాలి. బ్రహ్మమును ఎప్పుడైతే అనుభవంలోనికి తెచ్చుకొన్నావో అప్పుడు నీకు మోక్షం కలుగుతుంది. అంతవరకు నీకు మోక్షం కలుగదు. అయితే ఈలోపు మోక్షం కలుగకపోయినా జన్మలు వచ్చేస్తాయి. నీవు కంగారుపడవద్దు. ఉపనిషత్తులమీద

ప్రీతి, పరమేశ్వరునియందు భక్తి నీవు వదలకుండా ఉంటే ఇంకో నాలుగు జన్మలు అదనంగా వచ్చినా ఫరవాలేదు. ఈలోపు నీవు కంగారుపడవలసిన పనిలేదు. నీవు సరియైన మార్గములోనే ఉన్నావు కాబట్టి గమ్యమును చేరతావు. వందలాది జన్మలు సక్రమంగా జీవించినవాడికి గాని ఆధ్యాత్మిక చింతన కలుగదు. ఇది గాలికి రాదు. గత జన్మలో నీవుచేసిన కృషే నీకు సొమ్ము అవుతుంది. పూర్వజన్మలలో నీవు కష్టపడి ఉంటే, ఈ రకమైన సాధన చేసి ఉంటే నీ మొఖం ఇటు తిరుగుతుంది గాని లేకపోతే ఇటు తిరిగే అవకాశము లేదు. చెప్పుడు మాటలవలన వచ్చేది కాదు. గత జన్మలో నీవు చక్కగా జీవించి ఉంటే వస్తుంది గాని లేకపోతే రాదు.

మానవజన్మ రావటం అంత తేలిక కాదు. అందుచేత దానిని సద్వినియోగం చేసుకోండి. వచ్చినదానిని తేలికగా చూడవద్దు. మానవజన్మ రావటం ఇది ఒక అవకాశం. తెలివైనవాడు దానిని పట్టుకొంటాడు. అవకాశము ఎప్పుడూ రాదు. అవకాశం వచ్చింది కాబట్టి ఉపయోగించుకొని ఒడ్డుకు వచ్చేయి. భగవంతుడు ఇచ్చిన అవకాశములను చూసి గర్వపడకూడదు. వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలో శోధించాలి. అన్ని అవకాశములు ఉండి మీరు మోక్షం సంపాదించటానికి ప్రయత్నం చేయకపోతే మిమ్మల్ని మీరు హత్యచేసుకొన్నదానితో సమానము.

దేనిని స్వీకరించాలి, దేనిని విసర్జించాలి. ఏది సత్యం, ఏది సత్యం కాదు అనే వివేకం మీరు పెంచుకోకపోతే మీపాడు మీరే తెచ్చుకొంటారు. మీ అంతట మీరే నాశనం అయిపోతారు అని ఆచార్యులవారు చెపుతున్నారు. అవకాశములు వచ్చినపుడు వాటిని పట్టుకొని అభివృద్ధిలోనికి రావాలి. వచ్చిన అవకాశములను ఎవడైతే విడిచిపెట్టుకొంటున్నాడో వాడే fool అంతకంటే పెద్ద fool ఎవడూ ఉండడు అని ఆచార్యులవారు చెపుతున్నారు.

ధనం బాగా ఖర్చుపెట్టి యజ్ఞాలు చేస్తున్నారు, యాగాలు చేస్తున్నారు, పూజలు చేస్తున్నారు. భగవద్గీత, సుందరకాండ పారాయణ చేస్తున్నారు. ఇలా రకరకాల భక్తులు సమాజంలో ఉంటారు. ఈ వేషాలవలన మోక్షం రాదు. పూజలవలన, యజ్ఞాలవలన మీకు మోక్షం వస్తుంది అని ఎప్పుడూ అనుకోవద్దు. నీ హృదయంలో ఉన్న నిజాన్ని అనుభవంలోనికి తెచ్చుకోకుండా ఈ యజ్ఞాలవలన, యాగాలవలన మోక్షం రాదు. యజ్ఞాలు, యాగాలు, పూజలు చేసుకోండి. చేసుకోవద్దు అని చెప్పటంలేదు. కొంతవరకు పవిత్రత వస్తుంది. అంతమాత్రంచేత మోక్షం వస్తుంది అని భ్రాంతిలో పడకండి అని ఆచార్యులవారు చెపుతున్నారు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. ఆ నిజంలోనికి నీవు మేల్కొంటేగాని మోక్షంవచ్చే సమస్యే లేదు అంటున్నారు. నీలోపల ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి నీవు ప్రయత్నంచేయకుండా ఈ పూజలతో, పారాయణలతో సరిపెట్టుకొంటే నీవు వేలాది జన్మలు ఎత్తినా నీకు మోక్షం రాదు, రాదు అంటున్నారు ఆచార్యులవారు. విషయం అర్థమవ్వటంకోసం, ఉన్నది ఉన్నట్లుగా గట్టిగా చెపుతున్నారు. గురువు డ్యూటీ ప్రకారం చెప్పాలి కాబట్టి ఆచార్యులవారు చెపుతున్నారు. నీవు చేస్తావో, చెయ్యవో తరువాత విషయం.

నీవు ఈశ్వరునిమీద భక్తిని విడిచిపెట్టవద్దు. ఆ భక్తికి కారణంకూడా ఉండకూడదు. కారణం ఉంటే ఆకారణం నెరవేరుతుంది. ఈశ్వరునిమీద అకారణ భక్తి నీకు కుదిరితే ఇంకో వంద జన్మలు ఎత్తినా ఫరవాలేదు. తరువాత అయినా మోక్షం వస్తుంది. కారణభక్తివలన మోక్షం రాదు. కారణభక్తివలన దేహబుద్ధి నిన్ను విడిచిపెట్టదు. కర్మచక్రంలో తిరుగుతూ ఉంటావు. దేహబుద్ధి విడిచిపెడితేనేగాని ఆత్మబుద్ధి నీకు కలుగదు. దేహబుద్ధి నశించకుండా ఎవడికీ మోక్షం రాదు.

ఈ ప్రపంచం అనేది పెద్ద అజ్ఞాన సముద్రము. ఆ సముద్రములోనుండి ఎవడో వచ్చి నిన్ను రక్షిస్తాడు అని కనిపెట్టుకొని ఉండవద్దు. ఎవడో వచ్చి నాకు మోక్షం ఇచ్చేస్తాడు అని కనిపెట్టుకొని ఉండవద్దు. నిన్ను

నీవు రక్షించుకోవటానికి ప్రయత్నం చేస్తే దేవుడువచ్చి ఆయనచేసే సహాయం ఆయన చేస్తాడు. నీవుచేసే ప్రయత్నం ఏదో చెయ్యి. కొద్ది ప్రయత్నం చెయ్యి. గురువు వచ్చి ఆయన చేసే సహాయం చేసి ఆయన స్వరూపమును ఇస్తాడు అంటున్నారు ఆచార్యులవారు.

వివేకవంతుడు ఈ ప్రాపంచిక బంధాలను ఒకోదానిని నెమ్మదిగా తెంచుకొంటూ వస్తాడు. ఈ బంధాలనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేస్తాడు. మనం ప్రయత్నం చేస్తాము అని ఆచార్యులవారు చెప్పటంలేదు. వివేకవంతులు ప్రయత్నం చేస్తారు అని చెపుతున్నారు. తెలివైనవాడు వాడికి ఉన్న ప్రాపంచిక బంధాలను ఒకో దానిని తొలగించుకొంటూ వస్తాడు. ఏగ్రంధి వాడిని ప్రపంచమునకు ముడి పెడుతోందో, ఏ వాసన వాడిని దేహమునకు ముడి పెడుతోందో చివరకు వాటిలోనుండి బయటపడతాడు. మనం వాసనలు అంటాము వాటినే. ఉపనిషత్‌లలో గ్రంధులు అన్నారు. దైవానుగ్రహం లేకుండా ఈ గ్రంధులు తెగవు.

దేహానికి, లోకానికి నన్ను కట్టేసిన గ్రంధులనుండి నేను బయటపడలేను. నా తెలివితేటలు, నా ప్రయత్నం ఒకటే సరిపోదు. వీటినుండి విడుదల చేయటానికి నీవు రావలసిందే అని భగవాన్‌తో చలంగారు అన్నారు. నిన్ను లోకమునకు, దేహమునకు కట్టేసిన గ్రంధులు నీ హృదయంలోనే ఉన్నాయి. ఆ గ్రంధులు ఎప్పుడైతే విడివడినాయో లోపలఉన్న పరమశాంతి, నిర్వాణ సుఖము తానుగా నీకు వ్యక్తమవుతుంది. శరీరం మరణించకముందే ఈ గ్రంధులు అన్నీ తెగిపోతే ఇక్కడే ఆ పూర్ణసుఖము, ఆత్మ సుఖము అనుభవంలోనికి వస్తుంది. పచ్చగడ్డి తిన్న దూడ ఒట్టిగడ్డివైపుకు చూడదు. అలాగే నీకు ఆత్మ సుఖం దొరికితే నీ మనస్సు ప్రపంచంవైపుకు తిరగదు, అటు చూడదు.

నిజమైన సాధకుడికి అల్లరి ఉండదు, ఆడంబరము ఉండదు. ఎవడైతే హృదయ గ్రంధులను తెంచుకోవాలని అనుకొంటున్నాడో వాడికి ఆడంబరము ఉండదు. గొడవలేకుండా ఒకో గ్రంధిని తెంచుకొంటూ వస్తాడు. ప్రక్కవాడికికూడా తెలియనివ్వడు. అది సాధకుడి లక్షణము. ఏ వాసన అయితే లోకమునకు బంధిస్తోందో, ఏ వాసన దేహమునకు బంధిస్తోందో అది చూసుకొని దానిని cut చేసుకోవటానికి చూసుకొంటాడుగాని ఊరేగింపులు, యజ్ఞాలు, యాగాలు వాడికి అక్కరలేదు. వివేకవంతుడికి ఊరేగింపులు అక్కరలేదు. వాడంతట వాడు పరిశీలన చేసుకొంటాడు. ఏ వాసన బంధిస్తోందో, దేనివలన పునర్జన్మ వస్తోందో చూసుకొని ఆ గ్రంధిని ఎలా cut చేసుకోవాలి అని ప్రయత్నం చేస్తూ ఉంటాడు. అప్పుడు ఈశ్వరానుగ్రహం వచ్చి దానిని cut చేస్తుంది. వారు పైకి ఏమీ తెలియనట్లు ఉంటారు. ఆధ్యాత్మికంగా లోపల ఎదిగిపోతూ ఉంటారు. పొందవలసినది ఏదో పొందుతారు. మనకు ఊరేగింపులు, దండలు మిగులుతాయి అంటున్నారు ఆచార్యులవారు. వారు మన ప్రక్కనే కూర్చొంటారు. లోపల చేసుకోవలసిన పని చేసుకొంటూ ఉంటారు. మన ప్రక్కనే కూర్చున్నాడు. వీడు ఎక్కడికి వెళతాడు అని మనం అనుకొంటాము. చేయవలసినపని ఏదో చేసుకొని వారు ఎదిగి వెళ్ళిపోతారు. వారికి మోక్షం వస్తుంది. మనకు ఊరేగింపులు మిగులుతాయి.

లోకంలో ఏదైనా గౌరవం తెచ్చుకొంటే స్మశానందాకా పదిమంది వస్తారు. ఆ ఊరేగింపులు స్మశానంతో పోతాయి. దేహగతమైన చరిత్రకూడా అక్కడితో ముగిసిపోతుంది. ఈ ఊరేగింపులు, సరదాలు, యజ్ఞాలు నీ దేహం ఎంత నిజమో అవికూడా అంతే నిజం. అసలు పొందవలసిన వస్తువును లోపల పొందు. నిజమైన సాధకుడు బయటకు చడిచప్పుడు లేకుండా వాడు చేయవలసినది ఏదో చేసుకొంటూ వాడు పొందవలసినది పొందుతాడు. అల్లరి జనంతోనే ప్రమాదం వస్తుంది. వాడు శాంతిలో, వివేకంలో ఎలా ఎదిగి వెళ్ళిపోతున్నాడో ప్రక్కవాడికికూడా తెలియకుండా ఎదిగివెళ్ళిపోతాడు. నీవు చేసుకొనే పని ఏదో అలా silentగా చేసుకొని పెద్దవాడివి అయిపో. మనకు శరీరం పెద్దది అయిపోతోంది. లోపల ఆధ్యాత్మికంగా శాంతిలో, వివేకంలో పెద్దవాడివి అవ్వటానికి ప్రయత్నం చెయ్యి. శరీరం పెద్దది అవ్వటానికి నీవు ప్రయత్నం చేయనక్కరలేదు

రెండుపూటల అన్నం తింటూ ఉంటే శరీరం పెద్దది అవుతుంది. దీని గురించి సాధన చేయనక్కరలేదు. వివేకం పెరగటానికి సాధనచెయ్యి, మోక్షం పొందటానికి సాధనచెయ్యి, శాంతి స్థితిలో నిలబడటానికి సాధనచెయ్యి.

నీవు మంచి మాటాడు, మంచి చెయ్యి, మంచి చూడు అంటున్నారు. మంచిగా ఆలోచించు. ఇలా ఆలోచించటంవలన నీ మనస్సు పవిత్రం అవుతుంది. నీవు మంచి చేస్తూ ఉంటే నీకు సూక్ష్మబుద్ధి కలుగుతుంది. నీవు పవిత్రుడవు అవుతావు. మనం ఏదోమంచి చెపుతున్నాము అనుకోండి. దానికి వేరే అర్థం తీసుకొని, దానిని మార్చి ఇంకో రకంగా అర్థంచేసుకొంటూఉంటే ఏమి చేయగలము. ఈ మాలోకం జనంతో మనం పడలేము. Right speech, right action, right understanding ఉన్నవారు బాగుపడతారు. భగవంతుడు ఒకమాట చెపితే దానిని ఎలా అర్థంచేసుకోవాలో అలా అర్థంచేసుకోవాలిగాని దానికి పెడార్థాలు తీయకూడదు. పెడార్థాలు తీస్తే నీవు పాడైపోతావు. నీకు పుణ్యబలం లేకపోతే ఆ శబ్దం దాని స్వరూపాన్ని నీకు ఇవ్వదు. భగవంతుడు ఏ హృదయంతో చెప్పాడో దానిని మనం గ్రహించాలి. పూర్వజన్మలో నీవు మంచి చేయకపోతే నీకు right understanding రాదు. Right action ఒక్కటే సరిపోదు, Right speech ఒక్కటే సరిపోదు. Right understanding కూడా అవసరము. Right path కూడా అవసరము.

భగవంతుడు చెప్పినమాట మీకు సరిగా అర్థంకాకపోతే మీకు పుణ్యబలం లేదు అని అర్థం. శబ్దాన్ని ఉన్నది ఉన్నట్లుగా అర్థంచేసుకోవాలి. విషయం అర్థమయ్యింది కాబట్టి అనుభవంలోనికి వచ్చేస్తుంది అనుకోవద్దు. అర్థమయిన విషయం అనుభవంలోనికి రావటానికి కొంతకాలము పడుతుంది. అక్కడ గురువు అనుగ్రహం అవసరము. విషయాన్ని నీవు సరిగా అర్థంచేసుకొన్నా గురువు అనుగ్రహం లేకపోతే అది అనుభవంలోనికి రాదు. వివేకమువలన, పవిత్రతవలన నీలోపల ఉన్న వస్తువు తెలుస్తుంది గాని బాహ్యంగా నేను ఏదో చేసాను అనుకోవటంవలన అది తెలియబడదు అంటున్నారు ఆచార్యులవారు. లోపల పవిత్రత ఉండాలి. యోగ్యత ఉండాలి. Correct understanding ఉండాలి వీటివలన వస్తువు తెలియబడుతుంది గాని అక్కడ ఏదో చేసాను, ఇక్కడ ఏదో చేసాను అంటే ఆ పనులవలన వస్తువు తెలియబడదు అంటున్నారు ఆచార్యులవారు.

వెలుతురుకు దగ్గరయ్యేకొలది చీకటికి దూరం అవుతావు. అసత్యములోనుండి బయటపడాలి అని నీవు అనుకోనక్కరలేదు. సత్యము ఉన్నది ఉన్నట్లుగా నీకు అర్థమయితే దానంతట అదే అసత్యమునకు దూరమవుతావు. సత్యాన్ని గ్రహించు. అసత్యాన్ని విసర్జించు. మంచిపనులు చేయవద్దు అని ఆయన అనటంలేదు. మంచిపనులు చేయటంవలన నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. మనస్సుకు పవిత్రత వస్తుంది. కాదని ఆయన అనటంలేదు. అంతమాత్రంచేత మోక్షం వస్తుంది అనే భ్రాంతిలో పడవద్దు. గురువు ఏదైనా చెపుతాడు అనుకో. మనస్సును అక్కడ పెట్టి శ్రద్ధగా విను. తరువాత ఆ మాటలను ధ్యానం చెయ్యాలి. మీరు శివుడిని, రాముడిని ఎలా ధ్యానం చేస్తున్నారో అలాగ గురువుద్వారా ఏమాట అయితే విన్నారో ఆ మాటను properగా అర్థంచేసుకొని ఇంటిదగ్గర ఆ అర్థాన్ని ధ్యానం చెయ్యాలి. మీరు బజారులో విగ్రహాలను కొనుక్కొని ఇంటికి తీసుకొనివెళ్ళి ఎలా పూజలుచేస్తున్నారో అలాగ మీరు విన్న subjectను ఇంటికి వెళ్ళి ధ్యానం చెయ్యాలి. ఆ మాటలను ధ్యానం చెయ్యాలి. అప్పుడు నీకు వివేకము పెరుగుతుంది, లోపల ఎదుగుతావు.

Subjectను అర్థంచేసుకోవటం మానివేసి లోపల ఉన్న గాలిని అంతా వదిలేసాను, బయట ఉన్న గాలిని లోపలికి లాగేసుకొన్నాను అంటే ఈ exercises వలన నీకు దేవుడు తెలియబడడు. వీటివలన మానసిక ఆరోగ్యము, శారీరక ఆరోగ్యము రావచ్చును. వీటివలన మోక్షం వస్తుందని భ్రాంతిలోపడకు. ఈ

పనులవలన మోక్షం వస్తుందని ఎదురుచూడకండి. రాదు, రాదు అంటున్నారు ఆచార్యులవారు.

ఎవడైతే సాధనచేస్తున్నాడో వాడియొక్క Success ఈ exercises మీద ఆధారపడిలేదు. ఎక్కడికో యాత్రలకు తిరిగివచ్చాను, ఆసనాలు వేసాను అంటే వీటిమీద ఆధారపడిలేదు. వాడికి ఉన్న గుణసంపద, దైవీ సంపదమీద వాడికి మోక్షం వస్తుందా, రాదు అన్నది ఆధారపడి ఉంది గాని నేను కూర్చున్నాను, నేను గాలిని బిగపెడుతున్నాను, నేను తిరుగుతున్నాను అంటే ఈ గొడవలకు దేవుడు మోసపోడు. చెప్పవలసిన విషయం చెప్పు. చెప్పకూడని విషయం చెప్పకు. చెప్పకూడని విషయం చెప్పటం ఎంత పొరపాటో చెప్పవలసిన విషయం విడిచిపెట్టెయటంకూడా అంతే పొరపాటు.

ఎప్పుడు పూజలు చేయాలి, ఎప్పుడు ధ్యానం చెయ్యాలి, ఎప్పుడు శ్రవణం చేయాలి అనేది నీ కాలమును అనుసరించి, నీ పద్ధతిని అనుసరించి నీ తిప్పలు ఏవో నీవు పడు, ఇవి అన్నీకూడా బ్రహ్మానుభవం కలగటానికి నీకు సహకారం చేయవచ్చు. అంతేగాని వీటివలననే బ్రహ్మానుభవం కలుగదు. మీరు శ్రవణం చేస్తున్నారు అంతమాత్రముచేత మోక్షం వచ్చివేయదు. మోక్షానుభవం పొందటానికి ఇది సహకరిస్తుంది. మోక్షానుభవం ఎవడైతే పొందాలి అనుకొంటున్నాడో ముందు తలకాయను ఉపయోగించుకొని వివేకమును Practice చెయ్యండి. ఏది సత్యము, ఏది సత్యముకాదు, ఏది గింజ, ఏది పొల్లు అని విడదీసుకొనే బుద్ధిని ప్రాక్టీసు చెయ్యి. నీ అభివృద్ధి అంతాకూడా దీనిమీద ఆధారపడి ఉంది అంటున్నారు ఆచార్యులవారు. వాపును చూసి బలం అనుకోవద్దు. Discriminationను విడిచిపెట్టవద్దు. బాహ్యంగా ఎవరితో సహవాసం చెయ్యాలి, ఎవరితో సహవాసం చేయకూడదు అనే విషయమే నీకు తెలియనపుడు లోపల ఉన్న సద్వస్తువు నీకు ఎలా తెలుస్తుంది అంటున్నారు ఆచార్యులవారు. ఎంతో కొంత వివేకములేకపోతే నీ దేహమే నిన్ను మోసం చేస్తోంది అన్న సంగతికూడా నీకు తెలియదు. అందువలన వివేకమును ప్రాక్టీసు చెయ్యి.

నీవు ఏ వస్తువును అయితే పొందాలో ఆ వస్తువుగురించి తెలిసినవ్యక్తిని ఆశ్రయించి ప్రశ్నించి తెలుసుకో. వారిని పరీక్షించటానికి అడుగవద్దు. నీవు తెలుసుకోవటానికి అడుగు అని ఆచార్యులవారు చెపుతున్నారు. నీకు మోక్ష స్థితి కావాలంటే మోక్షానుభవం ఉన్నవాడి దగ్గరకువెళ్ళి వినయంగా అడిగి తెలుసుకో. Subject తెలుసుకున్నవాడిదగ్గరకు వెళ్ళితేనే సరిపోదు. వాడు ఎలాంటివాడు అయి ఉండాలంటే సముద్రం ఎంత విశాలమైనదో అంత విశాలమైన ప్రేమ, అంత విశాలమైన కరుణ ఉన్న గురువును మాత్రమే ఆశ్రయించండి. ఒక్క బ్రహ్మవిద్య ఉంటే సరిపోదు. కరుణ, దయ ఉండాలి. Subject ఎదుటివారికి చెప్పివారిని ఉద్ధరించాలి అనే కాంక్షకూడా ఉండాలి. అటువంటి గురువును ఆశ్రయించండి.

వివేకవంతులుగా ఉండండి, తెలివిగా ఉండండి. గురువు నోటినుండి మాట జారేటప్పటికి వెంటనే దాని అర్థాన్ని గ్రహించే శక్తిని సంపాదించండి. గురువు నోటినుండి మాట క్రిందకు జారేటప్పటికి అది భూమిమీద పడకుండానే వెంటనే మీ బుర్రలో పెట్టేసుకోండి. ఆమాట భూమిమీద పడకుండా ఆమాట అర్థం ఏమిటో, దాని విలువ ఏమిటో గ్రహించండి. అవగాహన చేసుకొనే శక్తిని పెంచుకోండి. అవగాహనకూడా యోగంతో సమానము.

కొంతమందికి ప్రతీదానికి అనుమానం వస్తూ ఉంటుంది. Subject సరిగా అర్థంచేసుకొంటే ఈ అనుమానాలు అన్నీ కాలి బూడిద అవుతాయి. ఆధ్యాత్మికంగా మీకు వచ్చే సందేహాలు అన్నీ తగ్గాలంటే అందరిదగ్గరకు తిరగనక్కరలేదు. Subject సరిగా అర్థంచేసుకోండి. అవగాహనశక్తి ఎక్కువగా ఉంటే అనుమానాలు తగ్గుతాయి, కరిగిపోతాయి. Reasoning faculty పెరుగుతుంది. నీకు తెలివితేటలు ఉంటే, discrimination properగా ఉంటే, reasoning faculty ఉంటే బ్రహ్మానుభవం పొందటానికి నీవు fit అవుతావు.

నీకు తెలివితేటలు ఉన్నాయి అనుకో, బుద్ధి సూక్ష్మత ఉంది అనుకో, వాటితోపాటు భోగాన్ని అనుభవించాలి అనే కాంక్ష ఉంటే నిన్ను తీసి ఒకప్రక్కన పెడతారు. నీకు మోక్షం ఇవ్వరు అని ఆచార్యులవారు చెపుతున్నారు. భోగప్రవృత్తి ఏ రూపంలో ఉన్నా దానిని తొలగించవలసిందే. నీకు ఏ రకమైన భోగ కాంక్ష ఉన్నప్పటికీ నీవు బ్రహ్మానుభవం పొందటానికి అర్హుడవుకావు.

మోక్షంగురించి చెపుతున్నారు అనుకోండి మోక్షము పొందాలి మిగిలినవి అన్ని అశాశ్వతము అని మనకుకూడా అనిపిస్తుంది. మోక్ష స్థితిని పొందాలి అని కొద్దిసేపుమాత్రమే ఉంటుంది. తరువాతకూడా దేవుడు జ్ఞాపకం ఉంటాడుగాని మన కోరికలు నెరవేర్చుకోవటానికి దేవుని ప్రార్థిస్తాము. ఆచార్యులవారు చెప్పేది ఏమిటి అంటే మీరు ఏపని చేస్తున్నా, ఇంటిలో ఉన్నా, బయట ఉన్నా మీ ధ్యేయం మోక్ష కాంక్ష అయి ఉండాలి. మీ ముక్కులోగాలి ఎంతవరకూ తిరుగుతూ ఉంటుందో అంత కాలము ఆకాంక్ష ఆరిపోకుండా ఉండాలి. ఇప్పుడు మోక్షం కావాలి అని కోరుకొంటాము. మరల రేపు మనకు ఏదో కోరికలు ఉంటాయికదా అవి నెరవేరితే చాలు అనుకొంటాము. మోక్షమును వదలివేస్తాము. అలాకాదు నిరంతరము అదేకాంక్ష కలిగి ఉండాలి. భౌతికమైన కోరికలు నెరవేరతే నెరవేరతాయి. అది ముఖ్యం కాదు. మీ కాంక్షమటుకు మోక్షంమీద ఉండాలి. తాత్కాలికంగా అందరికీ మోక్ష కాంక్ష వస్తుంది. అది ఆరిపోకుండా చూసుకోవాలి. మోక్షం పొందాలి అనే కోరిక నిరంతరము ఉండాలి. మోక్షంపట్ల కాంక్ష మీకు అలా ఉంటే అది మీకు ఎరుకపడుతుంది.

నీకు రాముడిమీద భక్తి ఎలా ఉందో, కృష్ణుడుమీద భక్తి ఎలా ఉందో అలాగ నీ హృదయంలో ఉన్ననిజంపట్ల భక్తి ఉండాలి. దానిని తెలుసుకోవాలి అనే కాంక్ష నీ హృదయాంతరాళములనుండి రావాలి. నీ దేహముమీద నీకు ఎంత ప్రేమ ఉందో నీ హృదయంలో ఉన్న నిజంమీద నీకు అంత ప్రేమ ఉండాలి. అప్పుడు చావులేని స్థితికి ఎదిగివెళ్ళిపోతావు. నీవు అన్వేషించే వస్తువు, నిరంతరము ఉండే వస్తువు నీ హృదయంలో ఉంది. దానిపట్ల భక్తి కలిగి ఉంటే అదినీకు తానుగా వ్యక్తమవుతుంది. నీ శరణాగతి దీర్ఘ శరణాగతి అయి ఉండాలి. నీ హృదయంలో ఉన్న నిజంపట్ల ఉండవలసిన భక్తి నీకు లేకపోతే నీవు ఫెయిలవుతావు అంటున్నారు ఆచార్యులవారు. దానిపట్ల విశ్వాసము లేకపోతే అది నీవు పొందలేవు. ఆ వస్తువుమీద సజీవమైన విశ్వాసం ఉండాలి. ఏది శాశ్వతము, ఏది శాశ్వతము కాదు అనేవిభజన నేర్చుకోవాలి. ఆ విభజన మీకు తెలియాలి.

మనిషి పనిచేయకుండా ఉండలేడు. పనిచేస్తే ఫలితము వస్తుంది. ఆ ఫలితమును enjoy చేయటం మానివెయ్యి. కర్మఫలమును enjoy చేస్తే నీకు మోక్షం కలుగదు. నీవు పూజలు చెయ్యి, జపాలు చెయ్యి, యాత్రలకు వెళ్ళు, నీవు ఏమి చేసినా నీ కాంక్ష అంతా మోక్షంమీద ఉండాలి. అసత్యమునుండి విడుదల పొందాలి అనే కాంక్ష ఉండాలి. అది జీవితం పొడుగునా పోషించుకో నీవు తరిస్తావు. శ్రద్ధగా శ్రవణం చెయ్యి. వివేకవంతుడివికా. నీవు శ్రద్ధగా శ్రవణంచేసి వివేకవంతుడివి అయితే సందేహాలు తగ్గిపోతాయి. మాటమాటకు అనుమానించే స్వభావం పోతుంది. ఏ వస్తువుఅయితే అంతటా వ్యాపించి ఉందో దానినే అనుమానిస్తూ ఉంటే వాడికి సుఖం ఏమిటి? శాంతి ఏమిటి? వాటికి సుఖం లేదు, శాంతి లేదు. ఎవడైతే నీలోపల ఉండి సందేహిస్తున్నాడో వాడిని బయటకు తీసి కాల్చి బూడిద చెయ్యి. భగవంతుడు ఉన్నాడా, లేడా అనే సందేహానికి గంటగంటకు తావు ఇవ్వకు. జీవనదిలో నీరు ఎప్పుడూ ప్రవహిస్తూ ఉంటుంది. అలాగ మన విశ్వాసముకూడా దైవాభిముఖంగా ఎప్పుడూ ప్రవహిస్తూ ఉండాలి. ఈశ్వరునిమీద భక్తిని విడిచిపెట్టవద్దు. ఇంకో పది జన్మలు పడితే పడతాయి. భక్తి ఉంది అనుకో ప్రమాదంలో పడము. ఈ పది జన్మలలోకూడా దానిగురించి కృషి చేస్తావు. పొందవలసినది ఏదో పొందుతావు. భక్తిలేని జన్మ ప్రమాదముగాని భక్తి ఉన్న జన్మ ప్రమాదమును తీసుకొనరాదు. భక్తి కలిగిన జన్మ లోపల ఉన్న హృదయగ్రంధులను తెంచుతుంది. భక్తిలేని జన్మ హృదయగ్రంధులను పెంచుతుంది. అందువలన భక్తిని విడిచిపెట్టవద్దు.